# గడ్డిపువ్వు

ఆత్మహత్య చేసుకొనే ముందు ఆఖరిసారి నీతో మాట్లాడాలి – ఇదీ పేరిందేవి ఇచ్చిన టెలిగ్రాం.

ఆత్మహత్య నన్నంత కంగారు పెట్టలేదు గానీ, మద్రాసులో ఉండాల్సిన పేరిందేవి – మెయిల్‌లో ఎందుకు, ఎక్కడికి బయలుదేరుతోందా అని ఆశ్చర్యం కలిగింది. పేరిందేవికి ఏమీ తోచనప్పుడల్లా ఆత్మహత్య చేసుకుంటాననడం ఓ అలవాటు.

పేరిందేవి చాలా అందంగా ఉంటుంది. అందమయినవాళ్ళకి ఆత్మహత్య చేసుకొనే హక్కులేదు, వాళ్ళకోసం మగాళ్ళు చేసుకోవాలిగాని – అని నేనెప్పుడూ ఆవిడకి నచ్చ చెప్తూ ఉండేవాడిని. మా కాలేజీ రోజుల్లో ఆమెని మా తరం కుర్రాళ్ళంతా ఆనవాయితీగా ప్రేమించి, చొక్కాలు చింపుకొని, ప్రేమగీతాలు రాసి, చిన్న చిన్న ఉత్తరాలు రాసి, వాళ్ళన్నయ్య చేత చావుదెబ్బలు తిన్నవాళ్ళే. పేరిందేవి ఆ రోజుల్లో మా కాలేజీకి బ్యూటీ క్వీన్.

చెప్పొద్దూ, నేనూ కాలేజీలో చేరిన కొత్తలో ఆమెను ప్రేమించాను. కాని మా క్లాసుమేటు, నా రూంమేటు కాళ్ళు విరిగాక ఆ ప్రేమని అంతే రహస్యంగా అటకెక్కించేశాను. నాకు ప్రేమ మీదకన్నా నా శ్రేయస్సు మీద నమ్మకం ఎక్కువ. ఇప్పటికీ నా కథల్లో అందమయిన అమ్మాయిని ఊహించుకున్నప్పుడల్లా ఆ ముక్కూ, కళ్ళూ జ్ఞాపకం వస్తాయి. తమాషా ఏమిటంటే అందరి కుర్రాళ్ళలోకి నేను వెర్రితలలు పోకుండా ఉన్న పెద్దమనిషినని ఆమె దురభిప్రాయ పడింది. నా పెద్దమనిషి తరహాకి అర్థం నాలో ప్రేమలేకపోవడం కాదనీ, ప్రేమ ఫలించదన్న తెలివితేటలనీ ఆమెకి తెలిదు. ఆమె ఇంటికి తరచు వెళ్ళేవాడిని. నాతో

ఎవడెవడు ఎలాంటి కొక్కిరాయి పనులు చేశాడో చెప్పుకొనేది. మగాడు చేసే పనులాడది ఎలా తేలికగా జమకడుతుందో – ఆమె దగ్గర మొదటి పాఠాలు నేర్చుకున్నాను.

కాలేజీ ఆవరణదాటి ఉద్యోగంలో చేరి – సాహితీ వ్యాసంగంలో పరపతిని సంపాదించు కున్నాక రెండు కోరికలు మిగిలిపోయాయి. ఒకటి – నేను చదువుకున్న కాలేజీలో నా లెక్చరర్ల ముందే ఉపన్యాసం ఇవ్వడం. రెండు – పేరిందేవిని కలుసుకోవడం.

ఉపన్యాసాలివ్వడానికి పెద్ద కష్టపడనక్కర లేదు. పరపతి కంపోస్టు ఎరువులో పెరిగే మొక్కలాంటిది. సులువుగానే మొదటి కోరిక నెరవేరి పోయింది. ఇంక రెండోదే మిగిలిపోయింది.

ఓసారి ఏదో నాటక సమాజ ప్రారంభోత్సవానికి నెల్లూరు ఆహ్వానం వచ్చింది. స్టేషన్లో ఓ తెల్లటి మనిషి నన్ను రిసీవ్ చేసుకున్నాడు. పళ్ళు ఎత్తు. పెద్ద కళ్ళజోడు. వెనక చిన్నకళ్ళు. చాలా నమ్రతగా మర్యాదగా పలకరించాడు. సభకి మరో గంట వ్యవధి ఉంది, ఇంటికి వెళ్దాం అన్నాడు. ఇళ్ళలో మర్యాదలంటే నాకు కాస్త భయం. హొటల్‌కి పోదాం అన్నాను. 'ససేమిరా రావాల్సిందే. మమ్మల్ని ఇంటికి తీసుకెళ్ళడంలో ఓ పరమార్థం' ఉందన్నాడు. అదిగో, అలా మళ్ళీ పేరిందేవిని కలిశాను. అతని భార్య పేరిందేవని తెలిసినప్పుడు నాకాశ్చర్యం కలిగింది. పేరిదేవి ఇంకా అందమయిన వాడిని పెళ్ళి చేసుకొంటుందని నా ఊహ. స్టేషన్‌లో అతని నమ్రత చూసి ముచ్చటపడిన నేను, అతను పేరిందేవి భర్తని తెలిశాక సరిపెట్టుకోలేక పోయాను.

కోటేశ్వరరావు గురించి తెలుసుకున్నాక పేరిందేవి అతనిలో ఏం చూసిందో అర్థమయింది. అతను మంచివాడు. పెద్ద మనిషి. తన గురించి తాను చాలా తక్కువ మాట్లాడుతాడు. చాలా తెలివయిన లెక్చరరని విద్యార్థులు అతని పట్ల చూపే గౌరవాన్ని బట్టి అర్థం చేసుకున్నాను. తమ గొప్పతనాన్ని, అందాన్ని విరివిగా ప్రదర్శించే తోటి విద్యార్థులతో విసిగిపోయి ఉన్న పేరిందేవి అతనిలో ఒక 'రిలీఫ్'ని పొంది ఉంటుంది. మనం తరచు చూసేదాన్ని ఎదుటి వ్యక్తిలో 'మిస్' కావడమే ఒకప్పుడు ఆకర్షణ అనిపించుకుంటుంది. ఆ నెల్లూరు ప్రయాణంలో పేరిందేవి అందం కన్నా కోటేశ్వరరావు స్నేహం నన్నెంతో ఆకర్షించింది. ఇద్దరం చాలా తక్కువ వ్యవధిలో మిత్రులమయిపోయాం. నేను ఆఫీసు పనిమీద విజయవాడ చేరాక వాళ్ళింటికి చాలాసార్లు వెళ్ళాను. కోటేశ్వరరావులో ఓ విలువయిన ఆస్తిని సంపాదించుకున్నట్లు పేరిందేవి ప్రవర్తించేది. అతని తలకు నూనె రాయడం దగ్గరున్నుంచి, సాయంకాలం రాబోయే తలనొప్పి వరకు ఆమె పడే జాగ్రత్తలు చూస్తే నాకప్పుడప్పుడు అతని మీద ఈర్ష్య కలిగేది. భార్యలో "పొజెసివ్‌నెస్" చాలా అందంగా ఉంటుంది. అప్పటికి నా కింకా పెళ్ళి కాలేదు.

ఇప్పుడు పేరిందేవి టెలిగ్రాం చూసి ఆమె ఆత్మహత్యకి క్రొత్తకారణం ఏమయి వుంటుందా అని ఆలోచించాను. ఆ ఉదయం కోటు బొత్తాములు ఆమె కుట్టుకోకుండా తనే

కుట్టుకోవడమో, బయట హోటల్లో కాఫీ తాగొచ్చి – ఆమె చేతి కాఫీ తీసుకోకపోవడమో ఇలాంటి ఏ కారణమయినా కావచ్చు.

మెయిల్ పావుగంట ముందుగా వచ్చింది. అప్పటికే నా కోసం అన్ని వైపులా గాలిస్తోంది పేరిందేవి.

"ఇంత ఆలస్యంగా వచ్చావేం? నువ్వు రావేమోనని భయపడుతున్నాను" అంది.

"నువ్వు ఆత్మహత్య చేసుకున్నాక ఏకంగా పలకరిద్దామనుకున్నాను" అన్నాను నవ్వుతూ.

ముఖం ఎర్రగా చేసుకుని "ఈసారి నవ్వులాట కాదు రాము. ఇంటికి చేరాక అటో ఇటో తేల్చేసుకుంటాను" అంది.

"ఏడుస్తున్నప్పుడు కూడా నీ హాస్యం వదులుకోవు"

"సరే. ఆఖరిసారి – నా ఆతిథ్యం స్వీకరిద్దువుగాని. కాఫీ తాగుదాం పద" అన్నాను.

"కాఫీ వద్దు, చట్టుబండలూ వొద్దు బాబూ –" అంది.

"సరే. విషయమేమిటో చెప్పు" అన్నాను.

"మీ మిత్రుడు పెద్దమనిషని కదా మొదట్నుంచీ నీ నమ్మకం"

"పొరపాటు. అతను పెద్దమనిషని నువ్వు మొదట నమ్మావు. నీ నమ్మకాన్ని నేను నమ్మాను. కాదని ఇప్పుడేమయినా రుజువయిందా?"

మొదటిసారి పేరిందేవి కళ్ళలో నీళ్ళు చూశాను. "నీ నమ్మకాన్ని నేను నమ్మాను. ఆయన మరో అమ్మాయి వలలో పడ్డారు"

నిర్ఘాంతపోయాను. కోటేశ్వరరావు లాంటి మనిషి ఇంత ఆలస్యంగా జీవితంలో మరో అమ్మాయిని ప్రేమిస్తాడంటే ఆశ్చర్యమే మరి.

"నీకంటే అందమయిన అమ్మాయి ఎవరు కనిపించారబ్బా?"

"అందంలేదు నా బొందా లేదు. ఆవిడ నల్లగా కాల్చిన చింతపిక్కలాగ ఉంటుంది. పొట్టిగా గిడసబారి నట్టుంటుంది. చిన్న మెల్లకన్ను గూడాను"

ఇలాంటి సందర్భంలో ఆడదానికి ఎదుటి మనిషి అందవికారంగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. మెల్లకన్ను, చింతపిక్క పేరిందేవి దృష్టిఅయివుండవచ్చు. అంత అందవికారంగా ఉండడం సాధ్యమే అయితే – కోటేశ్వరరావు అభిరుచికీ, ప్రేమకీ అర్థం ఉండదు.

"ఇప్పుడు నన్నేం చేయమంటావు?" అన్నాను.

"ఆయన నీ మిత్రుడుగా? – నన్ను దూరంలో చేసుకోవడంలో ఏం నష్టపోతున్నారో గుర్తు చెయ్యి" అంది.

"ఈలోపున నువ్వు ఆత్మహత్య చేసుకొంటే ఆయన గుర్తు పట్టినా ప్రయోజనం ఉండదు" అన్నాను.

"మీ దయాదాక్షిణ్యాల మీద బతుకుతారని మీ మగవాళ్ళ ఉద్దేశం"

"పెళ్ళి చేసుకున్న మగవాళ్ళ ఉద్దేశం కావచ్చు. నా కింకా పెళ్ళి కాలేదు" అన్నాను.

అంత కష్టంలోనూ పేరిందేవికి నవ్వొచ్చింది. మొదటిసారిగా నా రెండు చేతులూ పట్టుకొని, – "ప్లీజ్ హెల్ప్‌మీ" అంది.

"ఆదివారం వెళ్ళి వస్తాను. కోటేశ్వరరావుతో మాట్లాడుతాను. నా నుంచి ఏ విషయం వినేవరకు నీ నిర్ణయాన్ని వాయిదా వెయ్యి...." అన్నాను. పేరిందేవి తలూపింది.

మెయిల్ వెళ్ళేవరకు నిలబడి యింటికొచ్చాను.

ఆ ఆదివారం నెల్లూరు వెళ్ళాను. నేను వస్తున్నట్టు ఉత్తరం రాయలేదు. కోటేశ్వరరావుకి. నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "ఏం సార్? ఏమిటి కొత్త ప్రోగ్రాం .... ఏదయినా ఉపన్యాసమా?" అన్నాడు.

'అవును. ఈసారి నాటక సమాజానికి కాదు. ఒక వ్యక్తికి. మీకు ఉపన్యాసం ఇవ్వాలని వచ్చాను. మీకు తెలుసో లేదో – మీ ఆవిడ ఆత్మహత్య చేసుకోవడానికి నాలుగు రోజుల క్రిందట వాళ్ళ ఊరు వెళ్ళింది" అన్నాడు.

కోటేశ్వరరావు తలదించుకొన్నాడు. "మీకూ తెలిసిందన్నమాట" అన్నాడు.

"అంటే ఆవిడ చెప్పింది నిజమేనా?"

'కళ్యాణి గురించి అయితే నిజం కాదు" అన్నాడు గంభీరంగా. అంత అందవికారికి అంత అందమయిన పేరు! ఆమె పేరు కళ్యాణి అన్న మాట.

"అసలింతకీ ఎవరీ కళ్యాణి?"

"కూర్చోండి. ముందు కాఫీ తాగుదాం. పది నిముషాల్లో కాలేజీకి వెళ్ళాలి. కళ్యాణిని చూశాక ఆమె గురించి చెప్పమంటారా? ఆమె గురించి చెప్పాక చూస్తారా?" అన్నాడు.

చూడని 'పారిస్' మహానగరాన్నేదో చూపించేంత గర్వంగా చెప్పాడతను. ఆమాటే అన్నాను. "నా దృష్టిలో ఆమె 'పారిస్' నగరంలాంటిదే. ఆమెనంత అందంగా తయారుచేశాను".

పసిపిల్లలు కొయ్యబొమ్మకి పరికిణీ వోణీ వేశాక చూసి ఆనందించినట్లు లేని 'కళ్యాణి'ని కళ్ళలో ఊహించుకుంటూ అన్నాడతను.

"కళ్యాణి అంత అందంగా ఉంటుందన్నమాట!" అన్నాను.

కోటేశ్వరరావు చిరునవ్వు నవ్వుతున్నాడు. "మీరే చూస్తారుగా? ఆరు నెలల క్రిందటే లేబరేటరీ అసిస్టెంటుగా కాలేజీలో చేరింది .... షీ ఈజ్ వర్చువలీ మై క్రియేషన్" అన్నాడు.

కళ్యాణి గురించి పేరిందేవి చెప్పిన దానికీ, కేటేశ్వరరావు మాటకీ పొంతన కుదరలేదు. ఇద్దరిలో ఒక్కరే నిజం చెప్పి ఉండాలి. ఎవరు చెప్పినట్టు? కళ్యాణిని చూడాలన్న ఆత్రం ఎక్కువయింది.

కోటేశ్వరరావుతో కలిసి కాలేజీకి వెళ్ళాను. రసాయనాల వాసనకొట్టే హాలులో ఒక మూల కుర్చీ వేసి కూర్చో పెట్టాడు. మొదటి పీరియడ్ విద్యార్థులకు పాఠం చెప్పకు పోతున్నాడు. ఏదో ప్రయోగాలు చేసి చూపిస్తున్నాడు. ఆపు దల లేకుండా మాట్లాడే తీరు. మాట్లాడుతున్నంతసేపూ చిరునవ్వు–అతనిలో కొత్త అందంలా కనిపించింది. ఇది కోటేశ్వరరావులో నా కంతవరకు తెలియని ఆకర్షణ. ఆ కళ్యాణి ఎవరో అతని వేపు ఆకర్షింప బడడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

గంట గడిచిపోయింది. నేనెందుకు ఎదురు చూస్తున్నానో నాకే అర్థం కాలేదు. విద్యార్థులు వెళ్ళి పోయారు. ఈలోగా ఎవరో తెల్లటి చీర కట్టుకున్న స్త్రీ వచ్చి అతని పక్కన నిలబడింది. నెమ్మదిగా రహస్యం చెప్తున్నట్లు మాట్లాడుతోంది. ఆమెను నా దగ్గరికి తీసుకొచ్చి పరిచయం చేశాడు కోటేశ్వరరావు.

ఆమెను చూడగానే నివ్వెరపోయాను. నోట మాట రాలేదు. ఆమె వేపే రెండు కళ్ళు అప్పగించి చూస్తూ నిలబడ్డాను. పేరిందేవి చెప్పిన మాటలో ఒక్క అక్షరం పొల్లు లేదు. కళ్యాణి నల్లగా, పొట్టిగా ఉంది. నోరిప్పితే తెల్లటి పళ్ళు మినహా, ఆమె సిగలో మల్లెలు తప్ప ఆ శరీరంలో ఎక్కడా తెలుపులేదు. కన్ను మెల్ల. మొదటిసారిగా పేరిందేవి నిజాయితీ మీద గౌరవం పెరిగింది. కోటేశ్వరరావు అభిరుచిమీద సన్నగిల్లింది.

కోటేశ్వరరావు నవ్వుతున్నాడు.

"ఈయన గొప్ప రచయిత. మా ఆవిడని కాలేజీలో ప్రేమించిన క్లాస్‌మేట్స్‌లో ఈయనొకరు" అన్నాడు.

కళ్యాణి చిరునవ్వు నవ్వుతూ నమస్కారం చేసింది.

సృష్టిలో ఏదో ఒక్క కోణంలో విచిత్రమయిన అందాన్ని అమర్చాడు దేవుడు. అతి జుగుప్సాకరంగా కనిపించే పీతనడకలో వయ్యారం కూడా సరిగ్గా చూస్తే కాస్త వింతగా, కొత్తగా కనిపిస్తుంది. కళ్యాణి చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె అందవికారం సగం క్షమించగలిగాను నేను. ఆమె నలుపుని మరిపించే మెరుపులాగ కనిపించింది ఆ నవ్వు.

ఆమె మాటల్లో సాధారణంగా స్త్రీ గొంతులో కనిపించే మార్దవం లేదు. ఆ విషయం ఆమెకీ తెలుసు. అందుకనే గొంతు విప్పి స్ఫుటంగా మట్లాడదనుకుంటాను. కాని తేలికగా రహస్యంలాగ, నెమ్మదిగా మాట్లాడటంలోనే ఓ కొత్త హుందాని సంతరించుకొంది. ఉన్న అందాన్ని బాహాటంగా ప్రదర్శించుటకోవడం వికారంగా ఉంటుంది. కళ్యాణికి తనకు లేనిదేమిటో తెలుసు. దానిని ఎలా భర్తీ చేసుకోవాలో తెలుసు.

ఆమె వెళ్ళాక – నేనింకా అలాగే నిలబడి ఉండటం చూసి నవ్వుకున్నాడు కోటేశ్వరరావు. "ఇప్పుడు కళ్యాణి గురించి చెప్తాను రండి. ఆమె గురించి తెలుసుకోడానికి మొదటి అర్హతని సంపాదించుకున్నారు" అన్నాడు.

ఇద్దరం కలిసి లైబ్రరీలోకి వచ్చి కూర్చున్నాం. చెప్పాడు.

"కాలేజీలో చేరిన రెండు నెలల వరకు ఆమె గురించి నేనూ పట్టించుకోలేదు. ఓ రెండు నెలల కిందటి వరకు ఆమె కూడా కాలేజీలో ఎవరి గురించీ పట్టించుకొనేది కాదు. ఏదో నేరం చేసిన మనిషిలాగ తనని, తన ముఖాన్నీ నలుగురికీ కనిపించకుండా దాచుకు తిరిగేది. ఆ లేబరేటరీ దాటి వచ్చేది కాదు. ఏదో శాపం నుంచి, విముక్తికి ఎదురు చూసే దేవతలాగా కనిపించేది. కాలేజీ కుర్రాళ్ళు 'బ్లాకీ' అని పేరు పెట్టారు. లేబరేటరీలోకి వచ్చినప్పుడు ఆమెను చూసి ముసిముసి నవ్వులు నవ్వుకోవడం నాకు తెలుసు. ఏదో చెయ్యని నేరానికి శిక్ష అనుభవించే నేరస్థురాలిగా ఆమె కనిపించేది"

సిగరెట్టు వెలిగించాడు.

"కట్టులో, బొట్టులో శ్రద్ధ ఉండేది కాదు. ఏదో చీర కట్టుకొని వచ్చేది. ఎప్పుడు గొంతు విప్పి మాట్లాడినా ఎందుకో క్షమాపణ చెప్పుకుంటున్నట్లుండేది. కాలేజీ వార్షికోత్సవానికి రెండురోజుల ముందే శలవు పెట్టేసింది. ఉత్సవంలో ఎక్కడా కనిపించలేదు.

తర్వాత తెలిసింది. నలుగురి మధ్యకీ రావలసిన ప్రమాదం నుంచి తప్పుకోడానికే శలవు పెట్టిందని"

"కాని యిప్పుడలా కనిపించడంలేదే!" అన్నాను.

"థాంక్స్. అదే నేను ఆమెలో సాధించిన విజయం" అన్నాడు గర్వంగా.

"అదేమిటి?"

"అవును సార్. జన్మతః ఆమె స్త్రీగాని, స్త్రీత్వాన్ని గుర్తు చేసే ఏ అనుభవమూ ఆమె జీవితంలో తొంగి చూడలేదు. రోడ్డుపక్క గడ్డిపువ్వుని ఎవరూ తలలో తురుముకోరు. ఎందుకంటే పదిమందిని ఆకర్షించే అందం కాదు దానిది. కాని వర్షం పలకరింతకి అది కాసేపయినా తలెత్తి చిరునవ్వు నవ్వుతుంది. ఆ దృష్టి ఉన్న ఒకరిద్దరినయినా, అది కాస్సేపు ఆలోచించేట్టు చేస్తుంది. కళ్యాణిలో అందవిహీనతకన్నా ఆ గుర్తింపు కోసం ఆమె పడే మధన, నలుగురి ఏవగింపు నుంచీ పారిపోవాలనే ఆరాటం నాకు చాలా జాలి కలిగించింది. ఆమె గురించి ఆలోచించడం ప్రారంభించాను. ప్రేమతో కాదు. జాలితో. వ్యక్తిగా చాలా గంభీరమయిన మనిషి. చాలా మంచిది. వ్యక్తి రూపానికి మోసపోయి మనం చాలా మంచి మనుషుల్ని నష్టపోతాం. ఈ లోకంలో సౌందర్యమంతా కేవలం కళ్ళదే అయితే, ఈపాటికి చాలామంది ఆత్మహత్యలు చేసుకొనేవారు. పక్క వ్యక్తిని కాకపోయినా, తమని తామయినా ఓదార్చుకొనే గర్వమో, నమ్మకమో ఉండాలి. అది కళ్యాణిలో కల్పిస్తే? ఒక్కరోజులో తేల్చుకొన్న ఆలోచన కాదు – ఆమెను చూసినప్పుడల్లా రూపం దిద్దుకొన్న ఆలోచన.

"కళ్యాణి క్రమక్రమంగా సమాధానం దొరకని క్రాస్‌వర్డ్ ఫజిల్‌లాగ కనిపించేది. నవ్వు ఆమెలో ప్రత్యేకమయిన అలంకారమని తెలిసి–ఆమెతో ఎప్పుడూ హాస్యంగా మాట్లాడేవాడిని. ఆ నవ్వులో గొప్పతనం ఆమెకి తెలిసేటట్టు చేశాను.

"మీలో నవ్వుని చూడాలనే మాట్లాడుతున్నానని" చెప్పాను. కళ్యాణి సిగ్గుపడింది.

ఆడదానిలో అందం ప్రత్యేకమయిన వరం కావచ్చు. కాని స్త్రీత్వం ఆమెకు జన్మతః వచ్చే హక్కు. ఒక మగాడి గుర్తింపు ఆమెను బహుశా ఆలోచించేటట్లు చేసి ఉండొచ్చు.

"అసలు తెల్ల చీరల ప్రయోజనం ఏమిటో తెలుసా? మీలాంటి వాళ్ళ అందాన్ని గుర్తించేటట్లు చెయ్యడానికి" అన్నాను. ఒకరోజు యథాలాపంగానే అన్నట్లు.

అంతే. వారంరోజుల్లో ఆమె అవతారం మారిపోయింది. సోమవారం తెల్లటి చీరతో కాలేజీకి వచ్చింది.

ఆమెని చూసి - "థాంక్స్" అన్నాను.

"ఎందుకు!" అంది ఆశ్చర్యపోతూ.

"నా అభిప్రాయం మీలో అందమయిన రూపు దిద్దుకున్నందుకు - ఐయామ్ ఆఫ్టర్ ఆల్‌రైట్" అన్నాను.

కళ్యాణి మళ్ళీ సిగ్గుపడింది. అసలు అందం అలవాటు అంటాను. క్లియోపాత్రను నెలరోజులపాటు చూసే అవకాశం మొహం మొత్తుతుందనుకుంటాను. అల్లాక్కాక ఓ కుంటిపిల్ల క్రమంగా స్త్రీగా, ఆరోగ్యంగా కోలుకోవడం ముచ్చటగా కనిపిస్తుంది. అందం అందంగానే బ్రతకడంలో మొనాటినీ ఉంది. కురూపి అందాన్ని సంతరించుకోవడం క్రియేటివిటీ ఉంది.

"కాలేజీలో ఉన్న రెండు వేలమందిలో రెండు కళ్ళు ఆమెలో మార్పుని గుర్తిస్తున్నాయని ఆమెకి తెలుసు. మరో నెలరోజుకి ముత్యాలదండ వేసుకొంది. ముక్కుపుడక పెట్టుకుంది. క్లాసులో కూడా యిదివరకులాగా బెదురు లేకుండా నా దగ్గరికి వచ్చి నలుగురి ముందు మాట్లాడడం ప్రారంభించింది. నలుగురూ ఆమెని ఆశ్చర్యంగా చూడటం ప్రారంభించారు. వాళ్ళు చూడడానికి కారణం ఆమె అందం కాకపోవచ్చు. కాని యింతకాలం సిగ్గుతో కుంచించుకు పోయిన ఒక వ్యక్తిలో మార్పు వాళ్ళని ఆశ్చర్య పరిచింది. ఆమెలో మార్పు వాళ్ళు గుర్తించిన అందం - మార్పు కోసం ఆమె ప్రయత్నం నేను గుర్తించిన అందం.

"శరీరంలో అందంతో సరిపెట్టుకొని, యితరత్రా ఎన్నో వికారాల్ని పోగుచేసుకుంటారు ఆడవాళ్ళు. అది మితిమీరనంతవరకు వాళ్ళ ఆకర్షణకి భయం లేదు. కాని కళ్యాణి శరీరాన్ని మురిపించే అందాన్ని క్రమంగా పోగుచేసుకొంది. యిప్పుడు ఆమె - నలుగురూ కాసేపయినా ఆలోచించే ఓ ప్రత్యేకమయిన వ్యక్తి. మొన్న ఓ ఫంక్షన్‌లో అందరూ ఆశ్చర్యపోయేలాగ స్టేజిమీదకి వచ్చి ఓ పాట పాడింది. అందరూ దిగ్భ్రాంతులయిపోయారు. ఇది నేను కూడా గమనించని విషయం. కళ్యాణి అద్భుతంగా పాడుతుంది. ఇవాళ కాలేజీలో ఆమె స్టార్."

"ఈ మార్పుకి కారణం మీరేనని ఆమెకి తెలుసా?"

"తెలుసు. చాలాసార్లు నేనే స్వయంగా కాఫీ హొటలుకి ఆహ్వానించాను. ఆమె వ్యక్తిగత జీవితాన్ని గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేశాను. పొద్దుట లేచాక దినచర్య ఏమిటి.

ఏ పౌడరు వాడుతుంది. ఏ సినిమాలంటే ఇష్టం? నవలలు చదువుతుందా? ఇలాంటివి. ఆమెకి క్రాస్‌వర్డ్ పజిల్సంటే చాలా ఇష్టం. రోజూ ఆ ప్రశ్నలకి సమాధానం వెదకడంలో ఆమెకు ఓ తెలియని ఆనందం ఉంది"

"నాక్కావలసింది ఆ ప్రశ్నలకి సమాధానం కాదు. సమాధానం వెదకడానికి ఆమె చేసే ప్రయత్నం. ఏ పౌడరు వాడుతారు? అని అడిగినప్పుడు ఆమె ఏం చెప్పాలో తెలీక తడబడటం తెలుసు. బహుశా-అటువంటివేమీ వాడేదికాదేమో. కాని తప్పనిసరిగా ఆ రోజు ఇంటికి వెళ్తూ పౌడరు డబ్బా కొనుక్కు వెళ్ళి ఉంటుంది. మర్నాడు నాతో మాట్లాడేటప్పుడు క్యూటికురా వాసన స్పష్టంగా తెలిసింది"

కోటేశ్వరరావుని ఆశ్చర్యంగా చూశాను.

మనిషి జీవ లక్షణానికి కొత్త అర్థాలు వెదికే గొప్ప పరిశోధకుడులాగ కనిపించాడు.

"కళ్యాణి ఇప్పుడిప్పుడే రంగులు సంతరించుకొంటున్న గడ్డిపువ్వు. అది ఒక్కరి దృష్టిని ఆకర్షించగలిగినా నా ఆనందానికి హద్దులుండవు".

"ఆ ఆకర్షణ మీమీదే వాలిందని మీ ఆవిడ అనుకుంటోంది" నవ్వాడు కోటేశ్వరరావు. 'నేనంటే ఆమెకి కృతజ్ఞత ఉంది. కాని ప్రేమకాదు. అది ఇంకా చాలాదూరం. ఆమెని చూసినప్పుడు ఒక వ్యక్తి అస్థిత్వానికి అందమయిన రూపకల్పన చెయ్యగలిగినందుకు ఆనంద పడుతుంటాను" అన్నాడు.

"మరి యిదంతా పేరిందేవికీ చెప్పలేకపోయారా?" అన్నాను. నవ్వాడు కోటేశ్వరరావు. "కళ్యాణిలో మంచి మార్పును ఊహించాక నేను ఆలోచించడం ప్రారంభించాను. నాలో చెడు మార్పుని నమ్మాక మా ఆవిడ ఆలోచనలు పెంచుకుంది. కళ్యాణిలో అందాన్ని గుర్తుపట్టడంలాగే, మా ఆవిడ మూర్ఖత్వాన్ని గుర్తుపట్టడానికి కాస్త వ్యవధి కావాలి" అన్నాడు.

అవును. కళ్యాణిలో ఒక సృష్టి రహస్యాన్ని చూస్తున్నాడు కోటేశ్వరరావు. కేవలం ఆడదాన్నే చూస్తోంది పేరిందేవి. భార్యగా ఆమెకు కలిగిన సంశయం మిత్రుడిగా నాకు కలగక పోవడంలో ఆశ్చర్యం లేదు.

"ఇప్పుడేం చేస్తారు? మీ ఆవిడ ఆత్మహత్య చేసుకుంటాననంటోంది" అన్నాను.

కోటేశ్వరరావు పగలబడి నవ్వాడు. "అని వారం రోజులు గడిచిపోయింది సార్. చేసుకుంటే ఈ పాటికి చేసుకోవలసింది" అన్నాడు.

నాకూ నవ్వొచ్చింది. మరొక రోజు కోటేశ్వరరావుతోనే ఉన్నాను. కళ్యాణిని ఆ సాయంకాలం భోజనానికి ఆహ్వానించాడు. ముగ్గురం కలిసి హొటల్‌లో భోజనం చేశాం. ఆశ్చర్యం. ఉదయం ఆమెలో కనిపించిన అందవిహీనత బొత్తిగా కనిపించలేదు నాకు. కోటేశ్వరరావు మాటలు విన్నాక-మార్పుకై ఒక గొప్ప ప్రయోగం ఆమెలో జరుగుతోందని గ్రహించాను. సర్వరు భోజనానికి అన్నీ అమర్చాక-తను ప్రత్యేకంగా కల్పించుకొని - అది తన ఇల్లు అయినట్టుగా ఎంతో నేర్పుగా ఓర్పుగా మా ఇద్దరికీ వడ్డించింది.

ఆ సాయంకాలం గడిదాక కోటేశ్వరరావు మాటల్లో పరమార్థం మరీ కొట్టవచ్చినట్టుగా కనిపించింది.

ఇంటికి బయలుదేరుతూ కోటేశ్వరరావుని అడిగాను, "మీ ఆవిడకి ఏం చెప్పమంటారు?" అని.

"ఆత్మహత్య భర్తల్ని వెనక్కి తీసుకొచ్చి అప్పగించదని చెప్పండి. తను స్వయంగా నాటిన మొక్క పెరిగి పూలు పూస్తోంటే తనే నాశనం చెయ్యొద్దని చెప్పండి" అన్నాడు.

విజయవాడ వచ్చేశాను.

తర్వాత పేరిందేవి చాలా రోజులు పుట్టింట్లోనే ఉండిపోయింది. నాకు ఉత్తరాలు రాస్తే మరి నాలుగయిదుసార్లు కోటేశ్వరరావు దగ్గరికి నేనే వెళ్ళి వస్తూ ఉండేవాడిని.

కోటేశ్వరరావులో అభిరుచినీ, అభిలాషనీ ఏవిధంగానూ పేరిందేవి అర్థం చేసుకోలేక పోయింది. నేను వివరంగా చెప్తే ....

"ఆడదాన్ని ఉద్ధరించడానికి ఈయనకేం అవసరం. ఆ చింతమొద్దుని ఈయన బాగుచెయ్యకపోతే ఏం కొంప మునిగింది. పెళ్ళాన్ని దూరం చేసుకొని పై ఆడవాళ్ళని ఉద్ధరించే భర్త దగ్గరికి నేను చస్తే వెళ్ళను" అంది.

నాకు నవ్వొచ్చింది. కోటేశ్వరరావూ ఆ మాటకి నవ్వుకున్నాడు.

ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో నాకు ఎంత తలబద్దలు కొట్టుకున్నా చాలాకాలం వరకు అర్థం కాలేదు. చివరకి ఎలాగయితేనేం, నేనే ఆ సమస్యని పరిష్కరించాను. ఎలాగంటే –

నేను కళ్యాణిని పెళ్ళి చేసుకున్నాను.

ఆమె మీద జాలితో కాదు. తనని తాను అలంకరించుకొంటూ, మొదటిసారిగా బయటి ప్రపంచాన్ని నిర్లక్ష్యంగా, గర్వంగా చూడగలిగే ఓ గడ్డిపువ్వు పట్ల గౌరవంతో.

----